క్లుప్తంగా

6 పోస్టులకు 95 దరఖాస్తులు


మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మణదొర

బాడంగి: మండల కేంద్రంలోని కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల వసతిగృహాల్లో ఆరు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించగా, 95 దరఖాస్తులు వచ్చాయని ఎంఈవో పి.లక్ష్మణదొర తెలిపారు. ఇదే విషయమై స్థానిక మండల వనరుల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మన్, స్కావెంజర్, చౌకీదారు తదితర కేటగిరీల పోస్టులకు బాడంగి, రామభద్రాపురం, తెర్లాం మండలాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.

సీసీ రోడ్లు నిర్మించండి


కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

బొబ్బిలిరూరల్: మండలంలోని రంగరాయపురం గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని సీపీఎం జిల్లా నాయకుడు పొట్నూరు శంకరరావు కోరారు. ఇదే గ్రామంలో మంగళవారం ఆ పార్టీ మహాసభ మంగళవారం జరగ్గా, పలు ప్రజాసమస్యల పరిష్కారంపై తీర్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కడా సాగునీరు తగినంతగా లేకపోవడంతో పొలాల్లోని పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామివారి చెరువు, కునుకుబంద, రామదారి చెరువులకు వీఆర్ఎస్ సాగునీరు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బీసీ, ఎస్సీ కాలనీల శ్మశానవాటికలకు వెళ్లేందుకు వీలుగా రోడ్లు వేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్.గోపాలం, ఉడమల నాగభూషణం, సాంబమూర్తి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక మండ పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో మంగళవారం సమావేశమైన ఆయన.. ఇటీవల జరిగిన గ్రామసభల్లో సర్పంచ్‌లు ప్రతిపాదించిన పనులను పక్కనబెట్టి, టీడీపీ కార్యకర్తలు ప్రతిపాదించిన పనులను అధికారులు ఆమోదించడం సరికాదన్నారు. అలాగే పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధుల వినియోగంలో సర్పంచ్‌లను కాదని టీడీపీ కార్యకర్తలకు పెత్తనం ఇవ్వడమేంటని ప్రశ్నించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులంతా ఐక్యతతో మెలగి, పంచాయతీల్లో అధికారాన్ని కోల్పోవద్దని తెలిపారు. ఇప్పటికైనా పంచాయతీ సమావేశాలు, సదస్సులు, అభివృద్ధి పనుల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు సముచిత ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

సంతకవిటి: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బిల్లాణి గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు మంగళవారం భూమిపూజ చేశారు. రూ.17.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, కాలువలు వంటి పనులు చేపట్టనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు కొల్ల అప్పలనాయుడు, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల మంజూరుకు ప్రతిపాదనలు

రాజాం: పట్టణంలో రెండు కొత్త రేషన్ డిపోల మంజూరుకు ప్రతిపాదనలు పంపామని రాజాం సివిల్ సప్లయి డీటీ ఎస్.చిరంజీవి మంగళవారం తెలిపారు. పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా మొత్తం 58 రేషన్ డిపోలు ఉన్నాయన్నారు. వెయ్యి రైస్‌కార్డులు దాటిన డిపోల పరిధిలో విభజన చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో రాజాం మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా రెండు డిపోలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు డోలపేట, మల్లికార్జునకాలనీల్లో ఒక్కో రేషన్ షాపు చొప్పున ఏర్పాటు కానున్నాయని, కలెక్టర్ ఆదేశాలతో వాటిని ఏర్పాటు జరుగుతుందన్నారు.

రైతన్న కన్నీటి వ్యథ!


ఇంజిన్ సాయంతో వరి పంటకు నీరు తరలిస్తున్న రైతు


పొట్టదశలో ఉన్న వరి పంట

రైతు సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సాగుకు అవసరమైన నీటిని సకాలంలో విడుదల చేయడంలో అధికార యంత్రాంగమూ విఫలం కావడంతో సాగునీటి కష్టాలు వేధిస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండిస్తున్న పంట ఎండిపోతుంటే కాపాడుకునేందుకు పొలంలోనే రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. వానాకాలంలోనూ నీటి కష్టాలేనా.. అని వాపోతున్నారు. సత్వరమే ప్రభుత్వం స్పందించి, సాగునీటి అవస్థలు లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

- అన్నదాతకు తప్పని సాగునీటి కష్టాలు
- 10 వేల ఎకరాల్లో ఎండిపోతున్న పంటలు
- మోటార్లతో నీరందించేందుకు ఆపసోపాలు
- అదనపు భారంగా ఇంజిన్‌ల అద్దె, డీజిల్ ధర
- పట్టించుకోని ప్రభుత్వ అధికార యంత్రాంగం

బొబ్బిలిరూరల్: రైతులను సాగునీటి కష్టాలు వీడడం లేదు. ఓ వైపు వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు సాగునీటి కాలువల ద్వారా సకాలంలో సాగునీరందక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు నిరంతరం పొలంలోనే ఉంటున్నారు. కొన్ని కిలోమీటర్ల దూరం నుంచి పైపుల ద్వారా పంటపొలాలకు సాగునీరు అందిస్తున్నారు. రైతుల్లో కొంతమంది దగ్గరున్న మోటారు ఇంజిన్‌లను ఒకరి తర్వాత ఒకరు వినియోగించుకుని, దగ్గరలోని చెరువుల నుంచి నీటిని పొలాలకు తరలిస్తున్నారు. మరికొంతమంది అయితే అద్దెలకు తెచ్చుకుని మరీ నీరందించేందుకు ప్రయత్నం చేస్తుంటే అప్పటికే ఎండిపోయిన పంట ఇంకాస్త పాడవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండెకరాలకు 10 లీటర్ల డీజిల్..

బొబ్బిలి డివిజన్‌లోని బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లో 30 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. వీటిలో 10 వేల ఎకరాల్లోని పంటపొలాలు సాగునీటి వనరులకు దూరంగా ఉండడంతో సాగుకు నీరందించడం కష్టమవుతోంది. ఇప్పుడు వరి పొలంలో నీరుండాలని వ్యవసాయాధికారులు సూచిస్తుంటే సాగునీటి కోసం వారు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. మోటారు ఇంజిన్‌ల అద్దె, డీజిల్ ధరలు అదనపు భారంగా నిలుస్తున్నాయి. రెండు ఎకరాల పొలంలో రెండు అంగుళాల నీరు ఉంచేందుకు 10 లీటర్ల డీజిల్ ఖర్చు అవుతోందని, లీటరు డీజిల్ ధర రూ.100కు పైగా ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ లెక్కన పంటకు అయ్యే పెట్టుబడి అధికమవుతోందని, కనీసం ప్రభుత్వ సాయమూ లేదని అన్నదాతలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోని వైఎస్సార్ ప్రభుత్వం చాలామంది రైతులకు సబ్సిడీపై మోటారు ఇంజిన్లు అందించడం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వానికి ఆ ఊసే లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోటారు ఇంజిన్ల పంపిణీ లేదు..

మండలానికి 50 చొప్పున మోటారు ఇంజిన్లను ప్రభుత్వం పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు లేకపోవడం విచారకరం. దీంతో పాటు ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా సాగు సాయం అందకపోవడంతో అటు ఆర్థికంగానూ ఇటు శారీరకంగానూ చితికిపోతున్నామని వాపోతున్నారు. ప్రస్తుతం పొట్ట దశలోని వరి పంటకు కనీసం రెండు అంగుళాల నీటిని అందివ్వాల్సి ఉండగా, షిఫ్టుల లెక్కన మరీ కష్టపడి నీరందిస్తున్నారు. మోటార్లకు వినియోగిస్తున్న డీజిల్ ధరలు కూడా విపరీతంగా ఉండడంతో ఉసూరుమంటున్నారు.

రాత్రిపగలూ కష్టపడుతున్నాం..

ఎండలకు ఎండిపోతున్న పంటను రక్షించుకునేందుకు రాత్రిపగలూ కష్టపడుతున్నాం. మోటార్లను అద్దెకు తెచ్చుకుని, వంతులు వేసుకుని మరీ వాటిని వాడుకుని సాగునీరు తరలించుకుంటున్నాం. మోటారు అద్దె రేటు, డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నా తప్పడం లేదు.

– సీహెచ్ కృష్ణ, అన్నంనాయుడువలస, బొబ్బిలి మండలం

ప్రతిపాదనలు పంపాం..



సాగునీటి ఆధారం లేని ప్రాంతాల్లోని రైతులకు పంపిణీ చేసేందుకు అవసరమైన మోటారు ఇంజిన్‌ల కోసం ప్రతిపాదనలు పంపాం. మండలానికి 50 చొప్పున ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఇంకా తమకు మంజూరు కాలేదు. వచ్చిన వెంటనే ఇస్తాం. నీటి లభ్యత అంతగా లేని ప్రాంతాల్లో రైతుల పంట అదృష్టం మీదే ఆధారపడి ఉంటుంది.

– మజ్జి శ్యామసుందర్, ఏడీ, వ్యవసాయ శాఖ, బొబ్బిలి

నేటి నుంచి 'పల్లె పండగ'


బాడంగి: వివరాలు వెల్లడిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: మండలంలో బుధవారం నుంచి పల్లె పండగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. తొలిరోజు అయిన బుధవారం గజరాయునివలస గ్రామంలో జరిగే పల్లె పండగకు ఎమ్మెల్యే బేబీ నాయన హాజరై, పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారన్నారు. ఈ నెల 17వ తేదీన బాడంగి, భీమవరం గ్రామాల్లో, 17న పిన్నవలస, కోడూరు, వీరసాగరం, డొంకినవలస, లక్ష్మీపురం, పిండ్రంగివలస గ్రామాల్లో, 18న గొల్లాది, మల్లంపేట, పెద్దపల్లి, తెంటువలస, పూడివలస, గూడెపువలస, ముగడ, బొత్సవానివలస గ్రామాల్లో, 19న ఆకులకట్ట, ఆనవరం, పినపెంకి, రేజేరు, పాల్తేరు, పి.వెంకంపేట, వాడాడ, కోటిపల్లి గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

రాజాం: మండలంలోని గురవాం, పొగిరి, వీఆర్ అగ్రహారం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో వి.శ్రీనివాసరావుతో పాటు పలు శాఖల అధికారులు ఆయా గ్రామాల్లోని అభివృద్ధి పనులను ప్రారంభించారు.

రేగిడి: మండలంలోని రేగిడి, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆ కార్యక్రమంలో పాల్గొని, ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్యామలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం చదువుకు అడ్డంకి కారాదు



రామభద్రపురం: డిస్‌లెక్సియాపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు


తెర్లాం హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమంలో ఎంఈవో త్రినాథరావు, ఉపాధ్యాయ సిబ్బంది


బాడంగి: అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

- డిస్‌లెక్సియాపై అవగాహన ర్యాలీలో వక్తలు

బాడంగి: వైకల్యం చదువుకు అడ్డంకి కాకూడదని ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, సిబ్బంది కలిసి డిస్‌లెక్సియా(అభ్యసన వైకల్యం)పై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అభ్యసన వైకల్యంతో బాధపడుతున్న విద్యార్థులు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటారు?.. నివారణ చర్యలపై ఆయన చైతన్యం చేశారు. విద్యార్థులు అభ్యసనంలో వెనకబడడాన్ని అభ్యసన వైకల్యంగా పరిగణించవచ్చని, ఆ సమస్యను గుర్తించి, సకాలంలో నివారణ చర్యలు చేపడితే విద్యార్థుల అభ్యసనంలో పురోగతి సాధించవచ్చన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా పిల్లల అభ్యసన మెరుగుకు కృషి చేయాలని కోరారు.

తెర్లాం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో డిస్‌లెక్సియా(అభ్యసన వైకల్యం)పై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లోని అభ్యసన లోపాలు గుర్తించి, నివారణ చర్యలకు సిబ్బంది కృషి చేయాలని ఎంఈవో జె.త్రినాథరావు తెలిపారు. వైకల్యం కారణంగా ఏ విద్యార్థీ విద్యకు దూరం కాకూడదని, అభ్యసన వైకల్యంతో బాధపడుతున్న విద్యార్థుల్లో పట్టుదల, ప్రోత్సాహం నింపేందుకు ఆయా రంగాల్లో కృషి చేసిన విభిన్న ప్రతిభావంతుల జీవిత చరిత్రలను వారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఐఈఆర్‌టీలు సునీల్, సూర్యారావు, అంగన్ కార్యకర్త వై.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్‌లెక్సియా(అభ్యసన వైకల్యం)పై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత సంబరాల్లో ఎమ్మెల్సీ విక్రాంత్


అమ్మవారి ఘటం వద్ద ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు


గ్రామదేవతల ఘటాల ఊరేగింపులో డాక్టర్ తలే రాజేష్ దంపతులు, తదితరులు

రాజాం: సారధి, రాజాం గ్రామదేవతల సంబరాల్లో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొన్నా రు. స్థానిక పట్టణంలో మంగళవారం ఉదయం జరిగిన బురదలపోలమ్మ ఘట ఊరేగింపులో అమ్మవారికి ఆయన మొక్కులు చెల్లించుకున్నారు. ప్రశాంత వాతావరణం పండగ జరిగేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పార్టీ అధికార ప్రతినిధి ఆసపు సూర్యం, కరణం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: గ్రామదేవతల ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. స్థానిక పట్టణంలోని చాకలివీధి వద్ద ఘటాలను దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవీలత, పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు


తెర్లాం: కుసుమూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో సునీల్‌కుమార్, తదితరులు

బొబ్బిలి/రామభద్రపురం/తెర్లాం/బాడంగి/రేగిడి/వంగర: మండలాల్లోని పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, ఇతర అధికారులంతా సాగు సలహాలు, సూచనలు చేశారు. వ్యవసాయంలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని, ప్రతీ రైతు ఏ నేల ఏ రకమైన పంటకు అనువైనదనే విషయం తెలుసుకుని, ఆ పంటను పండించుకోవాలని తెలిపారు. నూతన సాగు విధానాలు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, సదుపాయాలను రైతులకు వివరించారు.

పైడితల్లిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే


అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి దంపతులు

బొబ్బిలి: విజయనగరం జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన పైడితల్లి సిరిమానోత్సవానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సతీసమేతంగా వెళ్లి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పంటలు బాగా పండాలని, అందరూ సుఖసంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు.

తక్షణమే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

రేగిడి: ఉత్తరాంధ్రలో పెండింగ్‌లోని సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండలంలోని సంకిలి గ్రామంలో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించి, మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 22వ తేదీన అనకాపల్లిలో నిర్వహిస్తున్న ప్రాంతీయ సదస్సుకు పెద్దఎత్తున రైతులంతా హాజరుకావాలని కోరారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఉత్తరాంధ్ర అన్నివిధాలా వెనుకబడిందన్నారు. అన్ని వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా వినియోగించుకునేందుకు రైతులకు పాలకులు అవకాశాలు కల్పించడం లేదని దుయ్యబట్టారు. రైతుల అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లోని పంటపొలాలకు సకాలంలో సాగునీరు అందించలేని పరిస్థితిలో అటు పాలకులు ఇటు అధికారులు ఉండడం దురదృష్టకరమన్నారు. వంగరలో తోటపల్లి పాతకాలువ, రేగిడి, సంతకవిటిలో సాయన్నచానల్‌లు రైతులకు ఉపయోగపడని పరిస్థితిలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం సదస్సుల కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు, పార్వతీపురం మన్యం జిల్లా కౌలురైతు సంఘం అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం


రామభద్రపురం: ముచ్చర్లవలసలో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ప్రసన్నకుమార్, విద్యార్థులు


రామభద్రపురం: శాఖా గ్రంథాలయంలో అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమంలో లైబ్రేరియన్ సత్యవాణి, తదితరులు


రాజాం సిటీ: అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం

రామభద్రపురం: అందరికీ ఆదర్శనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం అని ప్రధానోపాధ్యాయుడు ప్రసన్నకుమార్ కొనియాడారు. మండలంలోని ముచ్చర్లవలస గ్రామ ప్రాథమిక పాఠశాలలో మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆయన అనేక రంగాల్లో రాణించి తన ప్రజ్ఞను చాటుకున్నారన్నారు. అంతరిక్ష పరిశోధనలో దేశాన్ని అగ్రగామిగా నిలిపి, గొప్ప శాస్త్రవేత్తగా పేరొందారన్నారు. రాష్ట్రపతిగా దేశానికి అత్యుత్తమ సేవలందించారన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని, ఉన్నత జీవనం సాగించాలని కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలోనూ కలాం జయంతి నిర్వహించి, ఆయన చిత్రపటానికి లైబ్రేరియన్, పాఠకులు కలిసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

వంగర: మండల కేంద్రంలోని వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించి, కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రాజాం సిటీ: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని రెడ్‌క్రాస్ రాజాం సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ కొనియాడారు. కలాం జయంతి పురస్కరించుకుని, కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. జాతి గర్వించదగ్గ నాయకుడు, శాస్త్రవేత్త ఎవరైనా ఉన్నారంటే వారిలో ప్రథములు అబ్దుల్ కలాం అని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో పెంకి చైతన్య, తారకేశ్వరరావు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా చెత్త సంపద కేంద్రాల నిర్వహణ


రాజాం: కంచరాం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు


సంతకవిటి: సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో సురేష్‌కుమార్

రాజాం: చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కంచరాం గ్రామ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. చెత్త సేకరణ, వాటి ద్వారా ఎరువుల తయారీపై క్లాప్‌మిత్రలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డాపు సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని బిల్లాణి గ్రామంలో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ పరిశీలించి, పలు సూచనలు చేశారు. తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా తీసుకువచ్చి, ఎరువులు తయారు చేయాలని తెలిపారు. రాయితీపై రైతులకు ఎరువులు అందజేసి, పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలని తెలిపారు.

ముగిసిన రాజాం గ్రామదేవత పండగ


రాజాం సిటీ: అమ్మవారి ఘట ఊరేగింపులో భక్తుల రద్దీ

రాజాం సిటీ: కొన్నిరోజులుగా జరుగుతున్న రాజాం గ్రామదేవత పండగ మంగళవారంతో ముగిసింది. ఉదయం బురదలపోలమ్మ ఘట తిరువీధి నిర్వహించారు. తొలుత సేనాపతి ఇంటి వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పట్టణంలోని అన్ని వీధుల్లో ఘటాన్ని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, ఘటానికి పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

సంతకవిటి: మండలంలోని మద్దూరు రామయ్యఅగ్రహారం, కొండగూడేం గ్రామాల్లో అసిరితల్లి వారాల సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులంతా అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం చిన్నారులు చేసిన కోలాటం చూపరులను ఆకట్టుకుంది.